క్లుప్తంగా

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను ఆయా శాఖల అధికారులు పెండింగ్‌లో ఉంచొద్దని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భాస్కర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కళ్యాణదుర్గం రూరల్: రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీఓ వసంత్‌బాబు ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐల్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డీఓ వసంత్‌బాబు మాట్లాడుతూ విధులపట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు గ్రామంలో వెలసిన సర్మాస్ హుస్సేనీ ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్వామివారి గంధం స్థానిక జామియా మసీదు వద్ద నుంచి దర్గా వద్ద నుంచి తీసుకొచ్చి, మహోత్సవం నిర్వహించారు. అనంతరం వన్నూరుస్వామికి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఎస్‌ఐ నబీరసూల్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం ఒకటో దీపారాధన ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఆవుల జాతర

కుందుర్పి: మండల పరిధిలోని వడ్డే పాలెం గ్రామంలో ఆవుల జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. వడ్డే పాలెం గ్రామంతో పాటు చుట్టు పక్కల పది గ్రామాల రైతులు ఆవుల జాతరలో పాల్గొన్నారు. ఆవులను వివిధ రూపాల్లో అలంకరించారు. అగ్ని గుండం చుట్టూ ఆవులను ప్రదక్షిణలు చేయించారు.

రెండు సెంట్ల స్థలం ఇవ్వాలి

రాయదుర్గంటౌన్: ఇళ్ల లేని నిరుపేదలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగార్జున డిమాండ్ చేశారు. గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం మంజూరు చేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. పేదలతో కలిసి 21, 22 వార్డుల పరిధిలోని సచివాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. సీపీఐ నాయకులు దుర్గన్న, నరసింహులు, వెంకటేశులు, మాంతేష్, బాషా, రాయుడు, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలకు రెండు సెంట్ల స్థలమిచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేయాలని కణేకల్లు గ్రామ సచివాలయం-2 ఎదుట సీపీఐ నాయకులు సోమవారం ధర్నా చేశారు. సీపీఐ మండల కార్యదర్శి గౌస్‌పీరా మాట్లాడారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

అక్రమంగా మట్టి తరలింపు

కూడేరు: రామచంద్రాపురం చెరువు సమీపం నుంచి మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. గొటుకూరు పంచాయతీలో అనంతపురం - బళ్లారి ప్రధాన రహదారి పక్కన ఎక్కువ వెంచర్లు వెలుస్తున్నాయి. అందులోకి వందలాది ట్రిప్పుల ఎర్ర మట్టి అవసరమవుతుండడంతో అధికార పార్టీ నాయకులు ఎర్ర మట్టిని అక్రమంగా తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి జేసీబీ, ట్రాక్టర్లు పెట్టి మట్టి తరలించారు. విషయం తెలుసుకున్న గనులశాఖ ఏజీ ఆదినారాయణ, పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాక్టర్లను పట్టుకున్నారు. అధికార పార్టీ నేతలు 30 మందిదాకా వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. చేసేదేమీలేక అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. బ్రాహ్మణపల్లి వద్ద ఓ వెంచర్‌లో మట్టిని తోలారని,చర్యలు తీసుకుంటామని గనుల శాఖ ఏజీ ఆదినారాయణ తెలిపారు.

హంతకులను శిక్షించాలి

బొమ్మనహాళ్: చంద్రగిరిలో కృష్ణమూర్తి శెట్టిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ మునివేలు, ఎస్‌ఐ నబీరసూల్‌కు ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ కృష్ణమూర్తిశెట్టిని హత్య చేయడం బాధాకరమన్నారు. గతంలో ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోకపోవడంవల్లే దారుణం జరిగిందన్నారు. నాయకులు నాగళ్లి రాజు, జయంతి సురేష్, హీరోజీరావు ఆధ్వర్యంలో నాయకులు అధికారులను కలిసి విన్నవించారు.

జీవితాల్లో మార్పు కోసమే సమావేశాలు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్

రాయదుర్గంటౌన్: చదువులో మెరుగుదల, మంచి వాతావరణం, పిల్లల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అత్యవసరమని, బాగా చదవగలరని అన్నారు. 15 రోజులకోసారి విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి అధ్యాపకులతో పిల్లల చదువుపై అడిగి తెలుసుకోవాలన్నారు.

ఒక్క సిలిండరే దిక్కు!

- ఏడాదికి మూడు సిలిండర్ల హామీకి మంగళం
- వచ్చే మార్చి వరకూ ఇదే సర్దుబాటు
- ఆధార్, రేషన్‌కార్డులకు లింకు అయ్యి ఉంటేనే అర్హులు
- ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు



సరఫరా చేస్తున్న గ్యాస్ సిలిండర్లు

రాయదుర్గం: 'పెరిగిన నిత్యావసరాల ధరలకు తోడు .. పేద, మధ్య తరగతి కుటుంబాలకు గ్యాస్ బండ భారం తగ్గిస్తాం.. సూపర్‌సిక్స్ హామీల్లో ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తాం .. కూటమి అధికారంలోకి రాగానే ఈ కష్టాలు తీరుస్తాం' .. అని సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఊరూరా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చేసిన వాగ్దానమిదీ. దీపావళి పండుగ పురస్కరించికుని అమలులోకి తెచ్చిన ఉచిత గ్యాస్ పథకం ఆదిలోనే ఆటకెక్కింది. ఏడాదికి మూడు కాదు వచ్చేఏడాది మార్చి వరకూ ఒకే సిలిండర్ దిక్కయ్యింది. అక్టోబర్ 29 నుంచి 2025 మార్చి 31 వరకు తొలి గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకోవచ్చని ప్రకటించింది. ఈ లెక్కన మరో రెండు సిలిండర్లకు ఎగనామం పెట్టినట్లయ్యింది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం డివిజన్‌లోని మొత్తం 12 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలోని దీపం, పీఎంయూవై, సీఎస్ఆర్, జనరల్, కమర్షియల్ కలిపి మొత్తం 1,81,528 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో అర్హత కలిగిన వారంతా ఉచిత గ్యాస్ పొందేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా కొన్నిచోట్ల గ్యాస్ ఏజెన్సీలు ఈకేవైసీకి తిప్పుకుంటున్నారు. గ్యాస్ డెలివరీ బాయ్‌లకు ఈకేవైసీ అథారిటీ ఇచ్చినా వారు సక్రమంగా సేకరించలేదు. ఫోన్లుచేసి పిలిచినా సరిగ్గా పలకడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

తప్పని ఈకేవైసీ తిప్పలు

ఉచిత గ్యాస్ సిలిండర్ పొందాలంటే అనేక ఆంక్షలు అమలులోకి తెచ్చారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌కు సెల్‌ఫోన్ నంబర్ లింక్, గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈకేవైసీ తప్పనిసరి చేశారు. వీటిలో ఏ ఒక్కటి వ్యత్యాసమున్నా నగదు జమకాదు. ఎన్నికల హామీల్లో ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న చంద్రబాబు.. అధికారంలోకొచ్చిన తర్వాత కొత్త మెలిక పెట్టారు. ఈ విధానంపై వినియోగదారులు మండిపడుతున్నారు. గ్యాస్ కనెక్షన్‌తోపాటు బియ్యం కార్డు ఉంటేనే పథకం వర్తిస్తుందని, ముందుగానే నగదు చెల్లించే పద్ధతి బాగోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్‌లోని గ్యాస్ ఏజెన్సీలు, కనెక్షన్ల వివరాలు

గ్యాస్ ఏజెన్సీలు	12
దీపం	89,084
పీఎంయూవై	7,070
సీఎస్ఆర్	15,051
జనరల్	69,128
కమర్షియల్	1,249
మొత్తం	1,81,528

ఈకేవైసీ వేగవంతం చేయాలి



అర్హత కలిగిన వారందరికీ ఉచిత గ్యాస్ అందిస్తాం. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల కనుగుణంగా ఏజెన్సీ నిర్వాహకులు నడుచుకోవాలి. ఈకేవైసీ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి. గ్యాస్ డెలివరీ బాయ్స్‌తో ఇళ్లవద్దే ఈకేవైసీ చేయించాలి. ప్రభుత్వం గ్యాస్ సొమ్ము తిరిగి ఖాతాల్లోకి జమ చేస్తోంది. సాంకేతిక లోపాలతో ఒకటి రెండు చోట్ల ఏదైనా ఆలస్యం అయి ఉండొచ్చు. వినియోగదారులకు ఏ ఇబ్బందిరాకుండా ఏజెన్సీ నిర్వాహకులు చర్యలు చేపట్టాం. అందరికీ ఉచిత గ్యాస్ పథకం అందేలా చర్యలు చేపట్టాం.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

వన్నూరప్పకు విశ్వేశ్వరరెడ్డి పరామర్శ



వన్నూరప్పతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండల పరిధిలోని ఉదిరిపికొండకు చెందిన వైఎస్సార్ సీపీ నేత బోయ వన్నూరప్ప అనారోగ్యంతో అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి సోమవారం ఆస్పత్రికి వెళ్లి వన్నూరప్పను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆయన వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు బెస్త రమణ, సీపీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

కూడేరు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ మహబూబ్ బాషా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన వీఆర్వోలతో సమావేశమయ్యారు. భూసమస్యలు పెండింగ్ ఉన్నాయని, ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, అధికారులు పాల్గొన్నారు.

కనకదాస అడుగు జాడల్లో నడుదాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



భక్త కనకదాస చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ నేతలు ఉమా, తిప్పేస్వామి

కళ్యాణదుర్గం: కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస అడుగు జాడల్లో అందరం నడుద్దామని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో భక్త కనకదాస జయంతి వేడుకలను నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడుతో కలిసి కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం రంగయ్య మాట్లాడుతూ కురబలను చైతన్యపరుస్తూ ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదిగేందుకు చేసిన కృషి మరవకూడదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కులాలతో పాటు కురుబలకు సముచిత స్థానం కల్పించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజునాథ్, ఎంపీపీలు సోమనాథ్‌రెడ్డి, ఆంజినేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, కురబ సంఘం తాలూకా గౌరవాధ్యక్షుడు దొణస్వామి, మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, కోనాపురం గంగాధర, రేవన్న గౌడ్, తిరుమల వెంకటేశులు, నారాయణ పురం వెంకటేశులు, ఎంఎస్ రాయుడు, తిప్పేస్వామి,దొడగట్ట నారాయణ, అడ్వొకేట్ హనుమంతరెడ్డి, తలారి సత్తి, ప్రియాంక, మల్లాపురం మల్లి, పాతలింగ, కుందుర్పి ఎంపీటీసీ వెంకటేశులు, రామాంజనేయులు, మల్లేశ్, లోకేష్, గంగాధర, రుద్రంపల్లి గంగాధర్, గోళ్ల సూరి, పరంధామరెడ్డి, లక్ష్మన్న, పరమేశ్వరప్ప, యర్రంపల్లి కృష్ణమూర్తి, వన్నూర్ రెడ్డి, ఉమాపతి, షేక్షావలి, దీపు, రామాంజనేయులు, మల్లికార్జున, నాగలక్ష్మి, రామకృష్ణ, చరణ్, రామిరెడ్డి, జానీ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: భక్త కనకదాస జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తహసీల్దార్ మునివేలు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కనకదాస జయంతి సందర్భంగా కనకదాస చిత్రపటానికి పూజలు నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనకదాస జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, కురుబ సంఘం అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరు మండలంలోని చాబాలలో కనకదాసు జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. సర్పంచ్ మల్లెల జగదీష్ ఆధ్వర్యంలో కనకదాసు చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, వెల్ఫేర్ నరేష్, రెవెన్యూ అధికారి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరులో భక్త కనకదాసు జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. గ్రామంలోని భక్త కనకదాసు విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ట్రాక్టర్‌లో చిత్రపటాన్ని ఊరేగించారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని పోలేపల్లి గ్రామంలో కురుబలు కనకదాస జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. అనంతరం భక్త కనక దాస చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని 19వ వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకులు టప్పల్ బాబా, టప్పల్ జాకీర్ తల్లి టప్పల్ జైబున్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. సోమవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య టప్పల్ జైబున్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి షేక్షా, నాయకులు పాల్గొన్నారు.

హామీలపై అధికార పార్టీని నిలదీద్దాం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు రంగయ్య, ఉమా,తిప్పేస్వామి తదితరులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



ఎంపీపీ లక్ష్మిదేవమ్మను సన్మానిస్తున్న నాయకులు



హాజరైన పార్టీ శ్రేణులు

కంబదూరు: ఎన్నికల ముందు అపద్ధపు హామీలు ఇచ్చి, అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వాన్ని సమష్టిగా నిలదీద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ సచివాలయాల కన్వీనర్ సాకే గంగాధర్ అధ్యక్షతన నూతన ఎంపీపీగా లక్ష్మీదేవమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎంపీ రంగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు ఎంపీపీగా ఉన్న తిమ్మరాజమ్మ .. ఎంపీపీగా లక్ష్మీదేవమ్మకు అవకాశం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. గోవిందు దంపతులు చేసిన త్యాగం అందరికీ ఆదర్శమన్నారు. అపద్ధపు హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు.

114 చెరువులకు నీరు ఇస్తామన్న హామీ ఏమైంది?

తాము గెలిచిన తర్వాత నియోజకవర్గంలో 114 చెరువులకు నీరిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఇచ్చిన హామీ ఏమైందని నాయకులు నిలదీశారు. ఇలాంటి నేతల హామీలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రశ్నించాల్సిన ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చెప్పుకొని ప్రజల్లోకి వెళ్తున్నామంటే అది కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువేనన్నారు. హామీలు అమలు చేయనందుకు నిరసనగా డిసెంబర్ 21న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నియోజకవర్గంతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ అభిమానులు కొద్దిసేపు శబ్దం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే హామీలు అమలు చేయాలని నిరసన తెలపనున్నట్లు తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు అందరం సమష్టిగా పనిచేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఏడాదిలోపు బీటీపీ కాలువ పనులు ప్రారంభించకపోతే పార్టీ శ్రేణులతో కలిసి జీడిపల్లి వరకు పాదయాత్ర చేస్తామని రంగయ్య తెలిపారు. అనంతరం నూతన ఎంపీపీ లక్ష్మీదేవమ్మను, పార్టీ నేతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు గుద్దెళ్ల నాగరాజు, మంజునాథ్, బొమ్మయ్య మాజీ ఎంపీపీ తిమ్మరాజమ్మ, బీసీ, రైతు విభాగాలు గోవిందు, హనుమంతరాయుడు, మండల కన్వీనర్ బాలరాజు, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, నాయకులు ములకనూరు తిమ్మరాయుడు, భీమేష్, సోమనాథ్ రెడ్డి, సుధీర్, ఐపార్శపల్లి వెంకటేశులు, డాక్టర్ బొమ్మయ్య, మల్లూరు వెంకటేశులు, ఎంఎస్ రాయుడు, కరణం రాహుల్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామ్మోహన్, సర్పంచులు అమర్, హరినాథ్, బాపూజీ, రాజగోపాల్, చంద్రశేఖర్, లక్ష్మీదేవమ్మ, శివ, విజయ్, ఎంపీటీసీలు కుమార్, ఈరన్న, మల్లేశ్, మారెన్న, బసప్ప, నరేంద్ర, భాస్కర్, నాగరాజు, గురుమూర్తి, మల్లారెడ్డి, ముకుందా, ఆనంద్, నరేష్, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ రామకృష్ణ, కళ్యాణదుర్గం సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నారాయణపురం వెంకటేశులు, నరేంద్రరెడ్డి, సుదర్శన్ రెడ్డి, వన్నూర్‌రెడ్డి, బొమ్మన్న, దొడగట్ట నారాయణ, తలారి సత్తి, చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజు, గోళ్ల సూరి, మండలాల నుంచి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అట్టహాసంగా లక్ష్మీదేవమ్మ ప్రమాణ స్వీకారం

కంబదూరు ఎంపీపీగా రాళ్ల అనంతపురం ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవమ్మ ప్రమాణ స్వీకారం సోమవారం అట్టహాసంగా జరిగింది. గతంలో మూడేళ్ల పాటు ఎంపీపీగా పని చేసిన తిమ్మరాజమ్మ వ్యక్తిగత కారణాలతో ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. ఆమె స్థానంలో తాత్కాలిక ఎంపీపీగా లక్ష్మీదేవమ్మకు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

పదోన్నతుల్లో కదలిక

- రేపు 'మునిసిపల్' హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్
- తుది సీనియార్టీ జాబితా విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: ఎట్టకేలకు జిల్లాలో కార్పొరేషన్, మునిసిపల్ స్కూళ్ల టీచర్ల పదోన్నతుల్లో కదలిక వచ్చింది. ఈనెల 6న జరగాల్సిన హెచ్‌ఎంల పదోన్నతుల ప్రక్రియను ఈనెల 20న చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. హెచ్‌ఎంలు, , స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల సీనియార్టీ తుది జాబితాలను సోమవారం విడుదల చేశారు. హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎం పోస్టులకు ఇబ్బందులు లేకపోవడంతో 20న పదోన్నతుల కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. ఎస్‌ఏల పదోన్నతుల ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

మొత్తం 6 పోస్టుల భర్తీ..

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో 3 హెచ్‌ఎం పోస్టులు, మునిసిపాలిటీల్లో 3 హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో నేతాజీ నగరపాలక స్కూల్ ఎస్‌ఏ బయాలజీ టీచర్ ఎస్.లక్ష్మి మొదటి పేరులో ఉండగా, తర్వాత వరసగా 5 మంది శారదా నగరపాలక ఉన్నత పాఠశాల టీచర్లు ఉండటం విశేషం. రెండో స్థానంలో గణితం టీచర్ ఎం.శ్రీదేవి, మూడో స్థానంలో గణితం టీచర్ వై.రేణుక, నాల్గో స్థానంలో సోషల్ టీచర్ ఎస్.వాసుకి, ఐదో స్థానంలో గణితం టీచర్ ఎస్.శ్రీలత, ఆరో స్థానంలో బయాలజీ టీచర్ ఎం.రజియా బేగం ఉన్నారు. మునిసిపాలిటీలకు సంబంధించి రాయదుర్గంలో రెండు, గుంతకల్లులో ఒక హెచ్‌ఎం పోస్టు ఖాళీగా ఉంది. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. ఫైనల్ సీనియార్టీ లిస్టులు ప్రకటించామన్నారు. ఈనెల 20న హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ చేపడతామన్నారు.

వైభవంగా గజగౌరి అమ్మవారి ఊరేగింపు



అంబాపురంలో భక్తుల నడుమ సాగుతున్న గజగౌరి అమ్మవారి ఊరేగింపు , గజగౌరి అమ్మవారు

కణేకల్లు: మండలంలోని అంబాపురం గ్రామంలో సోమవారం గజగౌరి అమ్మవారి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. ట్రాక్టర్‌లో గజగౌరి అమ్మవారిని కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. సోమవారం వేకువజామున 5 గంటలకు ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు ఉదయం 11 గంటల వరకు కొనసాగింది. అనంతరం అమ్మవారిని హెచ్చెల్సీలో నిమజ్జనం చేశారు.

జోడు లింగాలకు ప్రత్యేక పూజలు

కూడేరు: కార్తీకమాసం మూడో సోమవారం కూడేరులోని శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజ స్తంభం, ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

కల్లే గౌరమ్మ పూల రథోత్సవం

విడపనకల్లు: మండల కేంద్రంలో కల్లే గౌరమ్మ పూల రథోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కల్లే గౌరీదేవి వేడుకలు ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యాయి. పూల రథోత్సవానికి వేల్పుమడుగు, కరకముక్కలు, మాళాపురం, విడపనకల్లు, ఆర్.కొట్టాల, పెద్ద కొట్టాలపల్లి, వి.కొత్తకోట, గడేకల్లు, జనార్దనపల్లి, వేల్పుమడుగు, మాళాపురం గ్రామాల నుంచేకాకుండా ఉరవకొండ, కూడేరు, అనంతపురం, కర్నూలు జిల్లా, కర్ణాటక ప్రాంతాల నుంచి తరలివచ్చారు. అనంతరం బావిలో గౌరమ్మను నిమజ్జనం చేశారు.

మార్మోగిన ఓసూరమ్మ నామస్మరణ

కూడేరు: మండల కేంద్రంలోని ఈడిగ వీధిలో ఉన్న ఓసూరమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి నామస్మరణ మార్మోగింది.

ఘనంగా పోలేపల్లి గౌరమ్మ జాతర

బ్రహ్మసముద్రం : మండలంలోని పోలేపల్లి గ్రామంలో గౌరమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి 1:30 గంట నుంచి గ్రామంలో గౌరీదేవిని ఊరేగించారు. గ్రామపుర వీధుల్లో మహిళలు, యువతులు చక్కెర హారతులు, జ్యోతులతో బారులు తీరారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలో కొలువుదీర్చారు. అనంతరం దాతలు, గౌరిదేవి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన జంబుకేశ్వరస్వామి, భక్త మార్కండేయస్వామి ఆలయం, నగరేశ్వరస్వామి ఆలయం, చన్నవీరస్వామి, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, బసవేశ్వరస్వామి, వీరభద్రస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం కార్తీక పూజలు చేశారు.

బొమ్మగుప్ప: బెళుగుప్పలోని రామేశ్వరాలయం, నగరేశ్వరాలయం, కన్యకాపరమేశ్వరి, విఘ్నేశ్వరస్వామి, శీర్పి శివాలయం, నక్కలపల్లి, గంగవరం, బూదిగుమ్మ శివాలయాలు, పద్మావతి వెంకటమణస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, రమనేపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన ఆలయ శ్రీకమల మల్లేశ్వరస్వామి శివాలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా సోమవారం స్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు.

పుట్టశిల పెద్దమ్మకు పూజలు

బొమ్మగుప్ప: కాలువపల్లిలో వెలసిన పుట్టశిల పెద్దమ్మ దేవత నూతన ఆలయంలో సంప్రోక్షణ చరప్రతిష్టా పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం గంగపూజ, గణపతి పూజ, నవగ్రహారాదన, దీక్షా హోమం , దుర్గా హోమం నిర్వహించారు. మంగళవారం అధివాప హోమం, దుర్గా సప్తశతీ పారాయణ, బుధవారం పెద్దమ్మ విగ్రహ చరప్రతిష్ట, చండీ హోమాలు ఉంటాయి.



జోడులింగాలకు రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం



గౌరీదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



విడపనకల్లులో కల్లేగౌరమ్మ రథోత్సవం



ఓసూరమ్మ దేవత, కల్లే గౌరమ్మ రథోత్సవం

సంక్షిప్త సమాచారం

కూడేరు హైస్కూల్లో ప్రత్యేక ఆధార్ సెంటర్

కూడేరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను సోమవారం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ- 2 సాయికృష్ణ, హెచ్‌ఎం శ్రీదేవి, ఎమ్మార్సీ రీసోర్స్ పర్సన్లు రమణ, శివ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

రాయదుర్గంటౌన్: రాయదుర్గాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) డివిజన్ కార్యదర్శి ఆంజనేయులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

కంబదూరు: గ్రంథాలయాలలోని పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యంబాబులు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు.

కరుట్లపల్లిలో వరి పంటకోత ప్రయోగం

కూడేరు: ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట దిగుబడి తగ్గినట్లు ఏఓ విజయ కుమార్, గణాంకాధిరిణి ఆశా తెలిపారు. సోమవారం కరుట్లపల్లిలో మంజునాథ్ అనే రైతుకు చెందిన వరి పంటలో పంటకోత ప్రయోగం చేశారు. 5 x5 మీటర్ల విస్తీర్ణంలో 12.05 కేజీల దిగుబడి వచ్చిందని ఏఓ తెలిపారు. ఎకరా విస్తీర్ణంలో 19 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ రాజకుమార్, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారి బాషా పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల నందు అనే విద్యార్థి ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయినట్లు పీడీ శ్రీనివాసులు సోమవారం తెలిపారు.

సాగునీటి సంఘం ఎన్నికలకు సన్నద్ధం

గుమ్మఘట్ట: మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలకు అధికారులు సన్నద్ధమయ్యారు. మండలంలోని గుమ్మఘట్ట, కలుగోడు, పూలకుంట, రంగసముద్రం, బేలోడు, భూపసముద్రం గ్రామాల్లో 7,448 మంది ఆయకట్టు రైతులు ఉన్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుమ్మఘట్టలో 2,109 మంది, కలుగోడులో 1,557, బేలోడులో 9,68, పూలకుంటలో 118, రంగసముద్రంలో 316, భూపసముద్రంలో 2,380 మంది రైతులు ఉన్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఉరవకొండ: ఉరవకొండ ప్రధాన శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు.

కుందుర్పి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమంత రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య

రాయదుర్గం: మండలంలోని వడ్రవన్నూర్‌కు చెందిన హనుమంతప్ప (30) ఇంట్లో ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్‌ఐ భాస్కర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.